క్లుప్తంగా

పరిశుభ్రత అందరి బాధ్యత



హైస్కూల్ వద్ద చెత్తను తొలగిస్తున్న కార్మికులు

బుచ్చినాయుడుకండ్రిగ: పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. ఆయన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో చెత్తా చెదారాన్ని పారిశుధ్య కార్మికులచే తొలగించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణ, పరిసరాలతోపాటు విధులను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్వచ్ఛతతోనే వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. తడి, పొడి చెత్త నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!



వికృతమాల సమీపంలో కోతకు గురైన తారురోడ్డు

ఏర్పేడు: పాపానాయుడుపేట– మునలిపేడు మార్గంలో తారురోడ్డు పనులు చేశారు. అయితే రోడ్డుకిరువైపులా పల్లపు ప్రాంతాల్లో మట్టితో చదును చేయకుండా అలాగే వదిలేయడంతో వాహనచోదకులు జారి పడుతున్నారు. మరీ ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి, గుంతల్లోకి దించేసి ప్రమాదాలకు గురవుతున్నారు. ఏర్పేడులోనూ ఆదే పరిస్థితి కనిపిస్తోంది. అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా తారు రోడ్డుకు సమానంగా మట్టిని పోసి చదును చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

జనని మిత్ర యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న కిరణ్ కుమార్

రేణిగుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ జిల్లా డిప్యూటీ డెమో కిరణ్ కుమార్ గర్భిణులకు జనని మిత్ర యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు తమ ఆరోగ్యం మెరుగు, పర్యవేక్షణను సులభతరం చేయడానికి జనని యాప్ ఉపయోగపడుతుందన్నారు. యాప్ సాంకేతికత ఆధారంగా, గర్భిణులు ఆరోగ్యం, ఆహారపు పోషక విలువలు, వైద్య పరీక్షలు, మందుల నియమాలు, అలాగే ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే తెలుసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ హైమావతి, సూపర్‌వైజర్లు నాగరాజు, కామరాజు, అనురాధ పాల్గొన్నారు.

యోగాతో శారీరక దృఢత్వం



యోగాసనాలు వేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఏర్పేడు: యోగాతో శారీరక దృఢత్వంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఏర్పేడు ఎంఈఓ–2 దయాకర్‌రావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పేడు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సిబ్బందితో కలసి యోగాసనాలు సాధన చేశారు. యోగా ప్రతిరోజూ దినచర్యగా చేయడంతో మానసిక అశాంతి దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ పీడీ శివకుమార్, వాణి, కార్యదర్శి వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయం వద్ద అపచారం

– ఆవరణలోకి రాజకీయ పార్టీ జెండాతో కారు



జ్ఞానప్రసూనాంబిక సదన్ వద్ద టీడీపీ జెండాతో ఉన్న వాహనం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాయలంలో ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం కిందిస్థాయి సిబ్బంది, ఉద్యోగులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అందుకు ఉదాహరణగా గురువారం టీడీపీ జెండా కలిగిన కారు ఆలయం ఆవరణలోని జ్ఞానప్రసూనాంబిక సదన్ వద్ద ఆపి దర్శనానికి వెళ్లడం చూపరులను నివ్వెరపరచింది. ఆలయ పరిసరాల్లో ఏ పార్టీ జెండాలు కానీ, ఇతరత్రా ప్రచారాలు ఏవీ రాకూడదనే నిబంధన ఉంది. దానిని ఆలయాధికారులు తుంగలో తొక్కారు. కారుకు జెండా కట్టి లోపలకు ప్రవేశించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరయ్యేవి. అంతేకాక గ్రామ స్వరాజ్యం దిశగా ప్రజల వద్దకే పాలన సంకల్పంతో ప్రజలకు చేరువ చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలను ఇచ్చింది. దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలో రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరయ్యేవి. నేటి పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదవుతున్నా ఇప్పటివరకు ఒక కొత్త పింఛన్ గానీ, కొత్త రేషన్ కార్డు గానీ మంజూరైన దాఖలాలు లేవు. దీంతో దరఖాస్తుదారులు దిక్కుతోచక అయోమయంలో పడ్డారు.

– వరదయ్యపాళెం

రేషన్ కార్డుల దరఖాస్తుల కోసం నాగలాపురం సచివాలయంలో వేచి ఉన్న దరఖాస్తుదారులు (ఫైల్)



వరదయ్యపాళెం మండలంలో గత ప్రభుత్వంలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)



కొత్త కార్డులకు వాత..
పింఛన్లకు కోత

- నాడు గంటల వ్యవధిలో మంజూరు
- నేడు రేషన్ కార్డు ఊసే ఎత్తని కూటమి సర్కార్
- అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

ప్రజల అవస్థలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నప్పటికీ ఒక్క రేషన్ కార్డు మంజూరు కాలేదు. ఇటీవల దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినప్పటికీ దరఖాస్తు కోసం సచివాలయాల వద్దకు వెళ్లితే అక్కడ సర్వర్లు పనిచేయని పరిస్థితి. అంతేకాక దరఖాస్తు చేసుకునేందుకు అనేక ఆంక్షలు విధించడంతో వాటిని సమకూర్చుకోలేక సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఈ కూటమి సర్కార్ ఇలా దాటవేసే ధోరణిని అవలంబిస్తోందే తప్ప మంజూరు చేసే పరిస్థితి లేదు.

పింఛన్ల కోసం ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నూతనంగా ఒక్క కొత్త పింఛను మంజూరు చేయని పరిస్థితి. అదిగో ఇదిగో అంటూ కాలయాపన తప్ప ఫలితం లేదు. వృద్ధాప్య, వితంతు పింఛన్ల కోసం సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో వందలాది మంది అర్హత కలిగి ఉన్నప్పటికీ నూతనంగా పింఛన్ల దరఖాస్తుకు అవకాశం కల్పించలేదు.

అప్పట్లో గంటలోనే..

ఈ ఫొటోలో కనిపిస్తున్నది కె.సెల్వి దంపతులు. వీరిది వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీ. వీరు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో వారికి నూతన రేషన్ కార్డును అందజేశారు. దీంతో ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలు అందుకున్నారు.



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు పొందిన కె. సెల్వి దంపతులు (ఫైల్)

10 నెలలుగా ఎదురుచూస్తున్నా



నా భర్త 10 నెలల క్రితం చనిపోయాడు. రెక్కాడితే గానీ డొక్కాడని గిరిజన కుటుంబం నాది. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన నాకు జీవనం ప్రశ్నార్థకంగా మారింది. అయితే ప్రభుత్వం నుంచి వితంతువు పింఛన్ వస్తుందని ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నా. ఇప్పటి వరకు పింఛన్ మంజూరుకాలేదు.

–గంగమ్మ, కాంపాళెం గిరిజనకాలనీ, బీఎన్‌కండ్రిగ మండలం

ఎదురుచూస్తున్నాను



కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్నాను. నా భర్త చనిపోయి ఏడాదవుతోంది. ఎన్నికల ముందు దరఖాస్తు చేసుకున్నాను. ఎన్నికల కోడ్ కారణంగా ఆ సమయంలో పింఛన్ మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో ఇంకా పింఛన్ మంజూరుకాలేదు. ప్రభుత్వం స్పందించి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

–మనెమ్మ, బీఎన్‌కండ్రిగ గిరిజనకాలనీ

అయినా పింఛన్ రాలేదు



నా వయసు 60ఏళ్లు పైబడింది. వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదంటున్నారు. పింఛనే ఆధారంగా జీవించే మాలాంటి వృద్ధులకు పింఛన్ మంజూరు చేయడంలో ఇంతటి నిర్లక్ష్యం వహించడం ప్రభుత్వానికి మంచిది కాదు.

–కస్తూరి, నాగలాపురం

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి



ప్రభుత్వం ప్రస్తుతం పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోయిన మహిళలకు పింఛన్లు అందజేస్తున్నారు. అయితే మిగిలిన వితంతువులు, వృద్ధులు, ఇతర వర్గాల మహిళలను పట్టించుకోవడం లేదు. వారికి తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలి. అంతేకాక కొత్త పింఛన్ల దరఖాస్తుకు అవకాశం కల్పించాలి.

–చంద్ర, సన్నిధి వీధి, నాగలాపురం

హుండీ ఆదాయం రూ.6.17 లక్షలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం తిరుపతి డివిజన్ దేవాదాయ శాఖ తనిఖీదారులు పనిరాజశయన్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈఓ లత మాట్లాడుతూ 67 రోజులకు గాను దేవస్థానం హుండీల ద్వారా రూ.5,73,453, అన్నదాన హుండీ లెక్కింపు ద్వారా రూ.44,102 గాను మొత్తం 6,17,550 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శివ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

2న రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా

శ్రీకాళహస్తి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జూన్ 2వ తేదీన ధర్నా చేపట్టనున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రొడ్డా గోపి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు వంతున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారుశీల, ఏఐఎస్ఎఫ్ నాయకులు ముని చందు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో హీరో శ్రీకాంత్ నవగ్రహ పూజలు



నవగ్రహ పూజలు చేయించుకుంటున్న హీరో శ్రీకాంత్

శ్రీకాళహస్తి: పట్టణంలోని సన్నిధివీధిలో ఉన్న రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం సినీ హీరో శ్రీకాంత్ కుటుంబ సమేతంగా నవగ్రహపూజలు చేయించుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి రేషన్ షాపుల్లోనే నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తారని తహసీల్దారు శ్రీదేవి తెలిపారు. ఆమె గురువారం కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్లతో సరుకులపై సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచాలన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులను అందించాలని తెలిపారు. షాపులను వీఆర్‌ఓలు పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సమైక్యతా ర్యాలీ జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి: దేశ సమగ్రతను కాపాడుకునేందుకు ఈ నెల 31వ తేదీన వామపక్ష పార్టీలు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ, ప్రజా సంఘాలు చేపట్టనున్న సమైక్యతా ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో గురువారం వామపక్ష పార్టీలు, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ, ప్రజా సంఘాలు నాయకుల ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం నశించాలి, మతోన్మాదాన్ని పారదోలాలి, దేశ సమగ్రతను కాపాడుకోవాలన్న నినాదంతో పట్టణ నాలుగు మాడ వీధుల్లో భారీ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. సమైక్యవాదులంతా ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పాస్టర్ సుందర్‌రాజు, పాస్టర్ ఆంబ్రోస్, లాల్ బాషా, మీర్జావలి, అన్వర్ బాషా, సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల నూతన కార్యవర్గం



రమణయ్య యాదవ్, మధుసూదన్‌రెడ్డి, సుబ్రమణ్యం

ఏర్పేడు: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు వైఎస్సార్ సీపీ నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏర్పేడు మండల కమిటీ

ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడిగా కూనాటి రమణయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా మునికృష్ణారెడ్డి, ఎం.రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.రమణయ్య ఆచ్చారి, టి.మునిరత్నం, కె.మునికుమార్‌రెడ్డి, కె.గంగాధరం, కార్యదర్శులుగా కె.వెంకటేష్‌రాయల్, ఏ.గిరిగౌడ్, సి.మునిరత్నం, ఎన్.మునిశేఖర్‌రెడ్డి, ఈ.అయ్యప్ప, ఎగ్జిక్యూటివ్ సభ్యులను నియమించారు.

శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడిగా సి.మధుసూదన్‌రెడ్డి(ఆక్స్‌ఫోర్డ్ మధు), ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లునాయుడు, ఊటా రమేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా కె.సుబ్రమణ్యం, పి.గురునాథం రెడ్డి, సి.కిరణ్, ఎం.మునిరత్నంరెడ్డి, కార్యదర్శులుగా కె.పద్మనాభయ్య, ఎన్.బండారయ్య, జయచంద్ర, శ్రీనివాసులు, పి.నారాయణ, సభ్యులను నియమించారు.

తొట్టంబేడు

తొట్టంబేడు మండలం పార్టీ అధ్యక్షుడిగా కోగిల సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా కె.గంగయ్య, వినాయకరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పి.మునిబాబు నాయుడు, టి.మోహనయ్య, నాగూర్ ముదిరాజ్, నాగభూషణం, కార్యదర్శులుగా పి.నరసింహారెడ్డి, ఎం.గంగాధరం, పి.గిరిధర్‌రెడ్డి, జి.మోహన్, జి.గురుమూర్తి, సభ్యులను ఎన్నుకున్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీ



సీహెచ్‌సీ గ్రూపు సభ్యులకు డ్రోన్ అందజేస్తున్న ఏఓ గౌరి

వరదయ్యపాళెం: వ్యవసాయంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతికతలో భాగంగా పంటలకు పురుగు మందుల పిచికారీ కోసం డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయశాఖ అధికారిణి గౌరి పేర్కొన్నారు. పెద్ద పాండూరులో ఏర్పాటైన శ్రీ కోదండరామ సీహెచ్‌సీ గ్రూపుకు సబ్సిడీ ద్వారా డ్రోన్ మంజూరు కావడంతో గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంబంధిత గ్రూపు సభ్యులకు డ్రోన్ యంత్రాన్ని అందజేశారు. కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో డ్రోన్ యంత్రాన్ని ఆవిష్కరించి పిచికారి చేసే విధానాన్ని డ్రోన్ టెక్నీషియన్లు గ్రూపు సభ్యులకు వివరించారు. మండలానికి 4 యూనిట్లు మంజూరయ్యాయని, అందులో మొదటి యూనిట్‌ను పంపిణీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్బీఐ మేనేజర్, రైతులు, శ్రీనివాసులు రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కృష్ణయ్య, మోహన్, వ్యవసాయశాఖ సిబ్బంది సుమంత్ తదితరులు ఉన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు



హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

వరదయ్యపాళెం: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల నిర్లక్ష్యం చూపొద్దని స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్ పేర్కొన్నారు. ఆ మేరకు హెచ్‌ఐవీ వ్యాధి యొక్క ప్రభావం, దాని వల్ల జరిగే ఇబ్బందుల గురించి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో కళా బృందం ద్వారా నాటక రూపంలో అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సుఖ వ్యాధుల గురించి అప్రమత్తంగా ఉండాల్సిన వివరాలను కళాజాత రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రోజా, ఏఎన్ఎం మౌనిక, కళాకారుడు జగన్నాథం ఉన్నారు.

బంజారా కాలనీ అభివృద్ధికి సహకరించండి



జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతిపత్రం అందజేస్తున్న బంజారా కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

రేణిగుంట: మండలంలోని వెంకటాపురం పంచాయతీలో బంజారాహిల్స్ కాలనీ అభివృద్ధికి సహకరించాలని బంజారా హిల్స్ అభివృద్ధి కమిటీ సభ్యులు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు భానోత్ హుస్సేన్ నాయక్‌ను కోరారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన భానోత్ హుస్సేన్ నాయక్‌ను గురువారం బంజారాహిల్స్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలసి, సత్కరించారు. బంజారా కాలనీకి రోడ్లు, రవాణా వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జీఓ నంబర్ 30 పేరు క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ వినతపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు సిఫారసు చేసి, కాలనీ అభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని భరోసా ఇచ్చారని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాలాజీ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్ రామ్ నాయక్, నారాయణస్వామి నాయక్, నిమ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు సమతుల్యంగా వేయాలి



మాట్లాడుతున్న సీఆర్‌డీఏ శాస్త్రవేత్త భరత్‌కుమార్

సత్యవేడు: వరి, వేరుశనగ, సజ్జ పంటలు సాగు చేస్తున్న రైతులు ఎరువులు సమతుల్యంగా వేయాలని సీఆర్‌ఐడీఏ (హైదరాబాదు) శాస్త్రవేత్త భరత్ కుమార్ కోరారు. మండలంలో గురువారం పుదుకుప్పం, మదనంబేడు, బాలకృష్ణాపురంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పంటలసాగు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. నూతన వంగడాలపై అవగాహన కల్పించారు. మేలైన యాజమాన్య పద్ధతులు వివరించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించి తగు విధంగా ఎరువులు వినియోగించాలన్నారు. శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ మామిడి, పూలతోటల్లోని సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏడీఏ సుబ్రమణ్యం మాట్లాడుతూ జనుము, జీలుగ రైతులకు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, ఏఓ మురళి, ఎంపీటీసీ శరవణన్, ఏఎంపుర సర్పంచ్ శిరీషా, శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంఈఓ రవీంద్రనాథ్ తెలిపారు. పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన గురువారం పాఠశాల పీడీ హరిబాబుచే సచివాలయ సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులకు యోగాసనాలు వేసి, అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా, యోగాసనాలు వేయటం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మునికృష్ణ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



అధ్వాన్నంగా చిన్నయగుంట రోడ్డు



గుంతలమయమైన రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్రాంతిలోపు రహదారులను తళతళ మెరిసేలా చేస్తామని, గుంతలు లేకుండా పూడ్చుతామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా ఆదరణలో కనిపించడం లేదు. మండలంలోని చిన్నయగుంట గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలమయంగా మారి చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. జంబుగోళం రోడ్డు నుండి చిన్నయగుంట గ్రామానికి రెండు కిలోమీటర్లు మేర మట్టి రోడ్డు ఉంది. ఈ రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో బురద మట్టిలో కాలుతీసి అడుగు వేయలేని విధంగా తయారవ్వడంతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టీసీ బస్సుల కట్టలు దెబ్బతింటున్నాయని, బస్సులను తిప్పటం మానేశారు. దీంతో ప్రయాణికుల ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.